# చివరకు మిగిలింది X

రచన:
ఎం. సావిత్రిదేవి, విశాఖపట్నం.

అణ్వాస్త్ర యుద్ధంలో ప్రపంచమంతా మండిపోయింది. ఎప్పటిలాగే భూగోళం తన నిర్ణీతపథాన విశ్వాంతరాళంలో దొర్లుకుపోతున్నది. మానవుల యుగాలనుండీ నిర్మించుకున్న సుందర నాగరికత, పేరుకుకూడ లేకుండ రూపుమాసిపోయింది. ఇప్పుడు పసిఫిక్ మహాసముద్రం ఒక పెద్దగొయ్యి. అక్కడక్కడ చిన్నచిన్న చెరువులలాగా తప్ప ఆగోతులలో ఎక్కడా నీరులేదు. ఆ తటాకాలలాగ ఉన్న గోతులలోని నీరుకూడా కదలకుండా ప్రశాంతంగా ఉన్నది. కెరటాలు మచ్చుకైనాలేవు. భూగోళపు ఉపరితలంలో జపాను, ఇంగ్లండు మొదలైన దీవులు అంతర్ధానమై పోయాయి. ఇండియాకు చీనాకు మధ్య పెద్ద అగాధమేర్పడింది. ఆ అగాధంలో లెక్కకందని లోతుగా నీరుంది. పార్వతీపరమేశ్వరుల నివాసమైన కైలాస పర్వతము, అంతర్ధానమై పోయింది.

86 లక్షల ప్రాణికోట్లు పూర్తిగ మాయమయ్యాయి. వాటి స్థానంలో కొన్ని కొత్త ప్రాణుల సముదాయం ఉత్పన్నమైనది. మానవుని ఆకారంలోవున్న ప్రాణులు మచ్చుకైనా కన్పించడంలేదు స్త్రీ, పురుషుడు కాని ఒక విపరీత వింతజంతువు పుట్టుకొచ్చింది. దానిస్వరూప, ఆకారాలు గతించిన మానవునికి దగ్గరగా పోలికలున్నవి. కాని గత చరిత్రలోనికి నెట్టివేయబడిన మానవుని లాగా ద్విపాద జంతువుకాదు. ఒక్క కాలితో, ఒక్క చేతితో, నడుము, గుండె, తల భాగాలు కలిసిపోయి విపరీతంగా కన్పిస్తూ వున్నది. ఒకేఒక పెద్ద కన్ను. బ్రహ్మాండమయిన దంతాలు, నోరూ, ముక్కూ ఒక్కటే లాగుంది. అలాంటి ప్రాణులు అక్కడక్కడా కన్పిస్తున్నాయి. వాటికి భాషా పరిజ్ఞానంలేదు. ఏదో వికృతంగా నవ్వుతున్నాయి. నవ్వినప్పుడల్లా భూగోళమంతా ప్రతిధ్వనిస్తున్నది.

ఆ వింత ప్రాణి పుల్లింగమో, స్త్రీలింగమో తెలియటంలేదు అవి నవ్వినప్పుడల్లా దంతాల చూటూ రకరకాలయిన క్రిమి, కీటకాలు ముసురుకొని అసహ్యకరమైన వాసనను బయటికి వ్యాపింపజేస్తున్నాయి. ఆ క్రిమి కీటకాలుగూడా పూర్వపు భూగోళంలోని వాటిలాగా లేవు. వాటిలాగా ఎన్నో రెట్లు పెద్దవిగా ఉన్నాయి. వాటికి, వీటికి పోలిక ఏమీలేదు.

సుందరమయిన అరణ్యాలు, నదులూ, కొండలూ ఏమీ భూమి ఉపరితలం పై కన్పించడంలేదు. ఎక్కడ చూచినా అగాధమైన లోయలు, గోధుమరంగు సరస్సులు, రక్తవర్ణపు క్రిమి కీటకాదులూ కన్పిస్తున్నాయి.

భూతలం పైభాగంలో వాతావరణం లేదు. ప్రాణవాయువు మొదలయిన గాలులన్నీ భూమికి అందటంలేదు. అతి కష్టంమీద యీ ప్రాణులన్నీ ఉఛ్వాస, నిశ్వాసాలు తీసుకుంటున్నాయి. సూర్యుడు వేయిరెట్లు కాంతితో మండిపోతున్నాడు ఒటువంటి ప్రళయాలు అతడు ఎన్ని చూశాడో! చంద్రుడు భూమికి ఉపగ్రహంగా లేనప్పుడు చంద్రుడు ఒక ప్రత్యేక గ్రహంగా ఖగోళంలో తిరుగుతున్నాడు. చంద్రలోకం యిప్పుడు కొద్దిమంది భూతలవాసులతో వాసయోగ్యంగా ఉన్నది. చంద్రుని చుట్టూ వాతావరణ మేర్పడింది. పచ్చిక, బయళ్ళు, చెట్లు, చేమ మొలిచాయి. చంద్రలోక వాసులు నిర్జనంగా, పేలవంగా విశ్వాంతరాళంలో నెమ్మదిగా దొర్లుకొని పోతున్న కాంతిహీనమైన భూమిని ఆశ్చర్యంతో చూస్తున్నారు. భూమిలో ఏర్పడ్డ గోతులు, సరస్సులు కొండలు మొదలయిన వాటిని దూరదర్శినితో చూసి ఆనందిస్తున్నారు. ప్రాణికోటి పెరగటానికి అనువుగా లేని, వాతావరణం క్రమంగా క్షీణించి పోతున్న భూమిని జాలితో చూసి, లోలోన నవ్వుకొంటున్నారు. అవును మరి. ఒకప్పుడు వారి పూర్వులు భూలోకంనుంచి యిదే విధంగా చంద్రుణ్ని చూచి ఆనందించేవారు.

కాని భూగోళంలో అక్కడక్కడ కొంతమంది స్త్రీ, పురుషులు, జంతువులు మిగిలాయి. అవి క్రమంగా, త్వరితగతిని నశించిపోతున్నాయి. వాటికి భూమిమీద యీ వాతావరణం ఏమీ నచ్చలేదు. నూతనంగా ఉద్భవించిన అనేక జంతుజాలం, ప్రాణికోటి యీ పాత ప్రాణికోటిని వింత, వింతగా చూడసాగాయి. పెద్ద పెద్ద ఈగలు, దోమలు, పురుగులు యీ పాత ప్రాణికోటి మారుమూల ప్రదేశాలకు పోయి, తలదాచుకుంటున్నాయి.

ఒకప్పుడు ఆ పాత ప్రాణికోటికి చెందిన మానవుడు ఒక బ్రహ్మాండ నాగరికతకు నిర్మాత, వారసుడు. కాని ఏమి లాభం? ఆ నాగరికతను తన చేతులతో తానే నాశనం చేసుకున్నాడు. తన స్వంత యింటిలోనే తాను యిప్పుడు పరాయివాడుగా చూడబడుతున్నాడు. గద్ద లాగా ఆకాశంలోకి ఎగిరిన తాను, చేపలాగా నీటిలో యీదగలిగిన తాను, యిప్పుడు తన స్వంత భూమాత ఒడిలో నిలవటానికి కూడా నోచుకోలేకపోయాడు.

బహుశా చరిత్ర వర్తులాకారంలో తిరిగి, స్వస్థలం చేరుతుందన్న సత్యానికి యీ పరిణామమంతా నిదర్శనం కావచ్చు. అతి వేగంగా, అత్యధిక వేగంగా విశ్వవీధిలో ప్రయాణం చేస్తున్న ఆ భూగోళంలో ఒక మారుమూల ఎడారిలో ఒక గొప్పజ్ఞాని, శాస్త్రవేత్త ఇద్దరు చంటి పాపలతో, ఒక కుక్క పిల్లతో, ఒక పిల్లి పిల్లతో అంతు తెలియని, గమ్యస్థానం లేని దారివెంబడి నడిచిపోతున్నారు. వారికింకా పూర్వపు ప్రాణుల వాసన, జ్ఞానమూ నశించలేదు. అణ్వస్త్ర మహాయుద్ధం జరిగిన బహు కొద్దిగంటలలోను ఆరడు ఈ యిద్దరపిల్లలను, కుక్క పిల్లి పిల్లను ఒక గదిలో దాచి ఉంచాడు. అణ్వస్త్ర ఆయుధాల తాకిడికి తట్టుకోగలిగిన గదిలో అతడు శాస్త్రవేత్త కాబట్టి దాచి ఉంచగలిగాడు. అతని భార్య ఆ మహా యుద్ధం జరిగిన కొద్ది వ్యవధిలోను బయటకు వెళ్ళి తిరిగి రాలేకపోయినందున మరణించింది. ఆ మహా యుద్ధం జరిగిన తరువాత అతడు యీ గమ్యంలేని ప్రయాణం సాగిస్తున్నాడు. ఏ దిక్కున చూచినా మానవులనుకాని, మరే యితర ప్రాణులనుకాని అతడు చూడలేదు. అంతా నిశ్శబ్దం. అతనికి యింకా ఆలోచనా శక్తి చావలేదు. అన్ని ఇంద్రియాలు, అవయవాలు సక్రమంగానే పని చేస్తున్నాయి. అతడు ఆలోచించుకుంటూ. పెద్ద అంగలు వేసుకొంటూ వెళ్ళిపోతున్నాడు. దీని అంతటికీ కారణం నేను. నాయొక్క శాస్త్రము. కాని నేనెందుకు పశ్చాత్తాప పడాలి? నా విజ్ఞానాన్ని పాపం, మానవులు ఋజుమార్గంలో ఉపయోగించుకొనకపోతే నేను దానికి భాద్యుణ్ని కాను, ఎప్పటికీ కాను. అహా! ఎంత మనోహరమైన సుందర నాగరికత కొద్ది గంటల కాలంలో నాశనమైంది. ఉదయం తాను లేచి కాఫీ త్రాగుతున్న సమయానికి ప్రపంచమంతా మామూలుగానే ఉంది. న్యూయార్కులో స్వేచ్ఛా దేవత విగ్రహం, పారిస్‌లో ఐడిల్ స్తంభము, ఆగ్రాలో తాజమహాల్, కైరో దగ్గర స్ఫింక్స్, ఓహో! ఇప్పుడేదీ, ఒక్క తృటికాలంలో సర్వం నాశనం అయిపోయింది. మానవ నాగరికత మళ్ళా మొదటికి వచ్చింది. అసలు మానవుడు యీ ఆకారంలో యిక ముందు మరల జన్మిస్తాడా? ఈ అందమైన అడవులు, వన్యమృగాలు, జలపాతాలు ఇంద్రధనస్సులు మళ్ళా ఏర్పడతాయా? సందేహం.

ఇలా ఆలోచిస్తూ పయనిస్తున్న ఆ ఏకాంత యాత్రికులకు ఏదో బ్రహ్మాండమయిన ప్రేలుడు శబ్దము, కండ్లను పొగొట్టే కాంతి తిగ్మాంతులను చేశాయి. వినువీధిలో ప్రయాణం చేస్తున్న యీ భూగోళము, అనంత వేగంతో ప్రయాణిస్తున్న మరొక గోళాన్ని ఢీకొన్నది. నాశనం. సర్వం నాశనం. భూగోళం తునాతునకలయింది. విశ్వధూళిలో భూఖండాలు కలిసిపోయాయి. మన యాత్రికులు విశ్వగర్భంలో కలిసి ఏదో అంతు తెలియని దిక్కుకు విసిరివేయబడ్డారు.

ఓం - శాంతిః - శాంతిః - శాంతి।

